# చేతబడి

జీమని ముసురు. రొజ్జ గాలి.

కటిక చీకటి. ఒంటిగంట దాటింది. తలమీద వేసుకున్న కర్చీఫ్. తడిసి ముద్ద అయిపోయింది. జుట్టు పూర్తిగా తడిసి నీళ్లోడిపోతోంది. బట్టలు తడిసి నడుస్తూ ఉంటే దబదబ శబ్దం చేస్తున్నాయి.

గది దగ్గరకొచ్చి తడిమేసరికి తాళానికి కప్ప దొరకలేదు. పిడికెడు గుండె, చిటికెడు ఎడ్రినలీన్ రక్తంలోకి వదిలిందేమో ఒళ్లంతా చెమట పట్టేసింది.

గడియ కూడా వేసి లేకపోవడంతో బలంగా తలుపు తోశాను. తెరుచుకుంది. లోపలికి వెళ్లి లైటు వేశాను. బల్బు వెలిగింది. అదైనా మిగిల్చారన్నమాట.

''అబ్బ !'' అని నేల మీద నుంచి చిరు మూలుగు వినబడింది - కింద దుప్పటి వేసుకుని పడుకున్నాడు శర్మ.

ఇరుగుపొరుగు ఇళ్లలో పుట్టి మూడేళ్ల వయసు నుంచి ఒక దగ్గర ఆడుకుంటూ పాడుకుంటూ, ఒకే బడిలో అక్షరాలు నేర్చుకుని, అలా అలా కాలేజీకి వెళ్లి అక్కడా ఓ రెండేళ్లు కలిసి సినిమా హాళ్లలో నుంచీ, కాఫీ హోటళ్లలో నుంచి పట్టభద్రులమై ఇంటర్మీడియట్ తరువాత విడిపోయాం. చిటికెలో తప్పిపోయాడు. లేకపోతే వాడూ నాతో మెడిసన్ చదువుతూ ఉండాల్సిందే.

''ముందు బట్టలు మార్చుకో ! నీకు తల తడిస్తే అసలే పడదు !''

'' ఎప్పుడొచ్చావు ? తాళం ఎక్కడిదీ ?''

''నా దగ్గర అదే గుత్తితో అలాగే ఉంది... నువ్ గదీ మార్చలేదు. తాళం కప్పా మార్చలేదన్న మాట..... యింకా కాలేజీలో చదువుతున్నట్టే అనిపించింది నాకు తాళం తీస్తూ వుంటే.''

వాడి మాటలు వింటూ వాడి వంక నిదానంగా చూశాను. కోటి ప్రశ్నలు నా కళ్లలో మెదలడం వాడికి కొట్టొచ్చినట్టు కనబడి వుండాలి.

''తల తుడుచుకో !.... అసలే...'' వాడికి దగ్గు రేగిపోయింది.

నా కళ్లతో చూసినదానితోపాటు వినబడుతున్న దగ్గు నా మెదడులోకి బోల్డు సందేశాలు ప్రసారం చేస్తున్నాయి.

శర్మ ఆరోగ్యం బాగా దెబ్బ తినేసింది, ఆదర్శాలను పెదవులు మాటల వరకే పరిమితం చెయ్యలేక మనసు వరకూ వాటిని ఆకళింపు చేసుకుని ప్రవర్తనలో ప్రతిబింబింపచేస్తూ ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యే మంచివాడు శర్మ. కొంపదీసి ఉద్యోగం తీసేశారా ? మనిషి కడుపునిండా తిని ఎన్నాళ్లో అయినట్టు ఇట్టే తెలిసిపోతుంది. పైగా మాసిన గడ్డం.... భుజాల మీద చిరుగుల చొక్కా మనిషంతటికి ఖణీమని కనబడుతున్నవి కళ్లే! ఆ కళ్లలో ఏదో చైతన్యం - అపూర్వమైన కాంతి.... వాడి కంటిలోకి నిశ్చలంగా వరుసగా నాలుగు సెకండ్లు చూడగలగడం ఎవరికైనా కష్టసాధ్యమే.

ఇంతరాత్రి నేను గదిలో లేనప్పుడు వాడు తాళం తీస్తూంటే ఎవరికంటా పడకపోవడం కేవలం అదృష్టమేనేమో ! మరో దగ్గు తెర.

మనసు కదలికల్ని తను పొందిన శిక్షణా తర్ఫీదూ కట్టడి చేశాయి. షర్టు విప్పి హేంగరుకు తగిలించి వరండాలో దండెం మీద పెట్టేశాను. తువాలు చుట్టుకుని పాంటు ఊడదీసి

బయటపడేశాను.

దగ్గుతెర నిమ్మలించి అడిగాడు '' ఇప్పుడు పోస్టింగ్ ఎక్కడ ?''

''పెరిఫెరల్స్... రేపటి నుంచి టిబి హాస్పిటల్...... సెకండ్‌షో సినిమా కెళ్లాం.... వాళ్లింకా.... నేను వచ్చేశాను''.

''తెలియని పాశం వెంటపడి ఋణం తీర్చుకోమంటుంది'' – ఆ పాటంటే వాడకి కేవలం అభిమానమే కాదు. వాడికెందుకో ఋణానుబంధం మీద గాఢ విశ్వాసం.

'' ఏడిశావ్! నాకు తందనాలాడడం ఇష్టం ఉండదు !'' వాడి మనసులోని పాట మరిపించాలని ప్రయత్నం చేశాను.

''నీ మనసు చాలా సున్నితమైనది.''

నాకు చచ్చేటంత సిగ్గనిపించింది.

''నువ్ మంచం మీద పడుకో !''

''అక్కరలేదు.... నాకు అలవాటే !''

''తలగడ తీసుకో...''

''అక్కరలేదు... ఇదిగో, ఇది ఉంది'' పాత న్యూస్ పేపర్ల దొంతి.

'' ఈస్టుకోస్టుకి వచ్చావా ? కోణార్క్‌కి వచ్చావా !'' నా మనసులోని ప్రశ్న 'మహాలక్ష్మి ఎక్కడుంది' అని. అది వాడికీ తెలుసు.

'' ఏడోనెల వచ్చిందని వాళ్లవాళ్లు వచ్చి తీసుకెళ్లారు... అదో కారణం... ఈ దగ్గుకి యివి పురిటిరోజులే !''

''కంగ్రాట్స్ ! ఉద్యోగంలో మళ్లీ గొడవ తెచ్చుకున్నావా ?'' నేను సూటిగా అడిగేశాను. మా ఇద్దరి మధ్య డొంక తిరుగుళ్లు అసహజమే కాదు, అసాధ్యం.

''తల బాగా తుడుచుకున్నావా! రొంపచేస్తే నీకు ఒకంతట వదలదు !'' అదే వాడితో వచ్చిన చిక్కు. మనసు నిండా నామీద ఆపేక్షే.... ఆ కళ్లనిండా నామీద మమతే !

దీపం తీసేశాను.

ఆర్నెల్ల కిందట హైదరాబాదులో రెండు గంటలసేపు వాడి 'ఇంటి' కోసం గాలించాను. నంబరైతే వుంది కాని అది పట్టుకోడానికి భగీరథుడ్ని గుర్తు చేసుకోవాల్సి వచ్చింది.

''తమ్ముడొచ్చాడే మాలక్ష్మీ !''

వాడి కేకలో ఎంత ఉత్సాహం. ఎంత ఆనందం.

''నమస్కారం... నా పేరు కరుణాకర రావ్ ! ''

''కరుణా తీరికగా మాటాడుకుందా. ముందు కాళ్లూ చేతులూ కడుక్కో! మహాలక్ష్మీ! ఎలా చేస్తావో, భరద్వాజుల వారి విందులా ఉండాలి !''

''విందంటున్నావ్ ! అవతల వాళ్లందరూ నా కోసం ఎదురుచూస్తూ ఉంటారు, ఒక గంటలో వచ్చేస్తానని చెప్పి వచ్చాను....''

'' నీ మొహం ! ఈ రాత్రికి వెళ్లి ఏం చేస్తావ్ !.... నీ ఉత్తరం వచ్చిన దగ్గర నుంచీ నే నొక్కడినే కాదు... మీ చెల్లాయి నీకోసం అలా ఎదురుచూస్తూనే ఉంది.''

ఆవిడ అక్కడే గబగబా వంట ప్రయత్నం చేస్తుంది. ఒకటే గది. అదే వంటకీ, భోజనాలకీ, పడకలకీ.

లేమి నెరుగని మనిషిని కాను. నా బ్రతుకూ అంతంత మాత్రమే. మెడికల్ కాలేజీలో చదువుతున్నావన్న మాటేగాని దరిద్రమంటే నాకు కొత్త కాదు. వింతా కాదు.

కిరసనాయిలు పొయ్యి మీదే చకచకా చేసింది ఆవిడ వంటంతా !

'' ఏమిట్రా ఆ తిండి ! వైద్యం చదువుతున్నావ్ ! బాగా తినాలని అందరికీ చెబుతావ్ ! నీ తిండేమిటి పిట్ట భోజనంలా ఉంది !''

వాడు మాటాడుతూనే వున్నాడు. ఆవిడ కొసరి కొసరి నాకు వడ్డిస్తూనే ఉంది.

''నేను వెళ్లక తప్పదబ్బాయ్ !'' వాళ్ల ఇద్దరి మధ్యా నేను ఆ గదిలో పట్టను. నాకు చచ్చేటంత మొహమాటం.

నన్ను వాడు బస్టాప్ వరకూ దిగబెట్టాడు.

'' ఒరేయ్ కరుణా! ఈ దెబ్బతో మా యాజమాన్యం ఆటకట్టు ! వాళ్లపొగరు అణిగిపోయింది..... మా వాళ్లందరూ నన్ను ఎన్నుకున్నారు నాయకుడిగా... వాళ్లమొహాన్న అడిగేశాను..... మా మేనేజింగ్ డైరెక్టర్ చిత్తయిపోయాడు.

నా దగ్గర జాగ్రత్తగా మాట్లాడుతున్నాడు. కలం చేతిలో ఉండాలి. మనసులో సత్తా వుండాలి.... అన్యాయాన్ని ఎదిరించడం ఎంత పని ?''

''అది సరే ! వాళ్లని ఎదిరించావ్ బాగానే ఉంది. ఎవరు లాభం పొందుతారో చూసుకో ! నీ సంగతి నీ ఉద్యోగం కించిత్ స్వార్థం చూసుకో. నేల విడిచి సాముచెయ్యడం తగదు'' నేను మెల్లగా వారించబూనాను.

'' ఐ డోన్ట్ కేర్ ఫర్ మై సెల్ఫ్!... నెలకు ఎనిమిది వందలు ఇచ్చి తీరవలసిందే ! మూడొందలిచ్చి మా కళ్లల్లో కారం కొడుతున్నారు. మాకు తినడానికి కానీ అడగడానికిగానీ నోరు లేదనేమో ! జలగల్లా యాజమాన్యం మా రక్తం తోడేసి తినేస్తుంటే ఎన్నాళ్లని ఇలా బ్రతకడం !''

''నేను మౌనం వహించాను.... వాడు జీవితం ఈ భాగ్యనగరంలో ఎలా వెళ్లబుచ్చుతున్నాడోనన్న ఆలోచన మనసులో మెదులుతోంది.

''జీతం మూడొందలయాభై ఏలే ! కానయితేనేం ? బొమ్మలు గీసి వాళ్ల దగ్గరే మరో రెండొందలు గుంజుకుంటున్నా !... నా గురించి నువ్వు ఏం బెంగపెట్టుకోవద్దు. మావగారూ అడపాదడపా పాతికా, యాభై వంపుతూనే ఉన్నారు. ఇదిగో మంచి ఉద్యోగం వేరే చూసుకుని...

''నీ సంగతెలా వుంది ? నీ చదువూ అయిపోవచ్చింది. ఇంకెన్నాళ్లులే ! ఈ సంవత్సరం తిరగకుండా నీకూ డిగ్రీ చేతికి వచ్చేస్తుంది... ఓ మాంచి డాక్టర్ అమ్మాయిని ఏరి చేసుకుంటే ఇద్దరూ ఓ నర్సింగ్‌హోం పెట్టి చతుర్విధ పురుషార్థాలూ సాధించవచ్చు !''

–వాడిలో ఎంత ఆశాభావం ! నా భవిష్యత్తును గురించి ఎన్ని వర్ణస్వప్నాలు కంటున్నాడు ! వీధికి డజను మంది డాక్టర్లు. పై భేషజానికే బోలెడు ఖర్చు అవసరం. ఆదాయం ఎలా ఉంటుందో దేవుడికే తెలియాలి...... కాలి నడక కూడదు.... కారు కలలో కూడా సాధ్యం కాదు. ఉద్యోగాల వంక చూడాలనుకుంటే అయిదారేళ్లయి కాచుకొని కూచున్న వాళ్లున్నారు. నాలాంటి వాడికి ఠికాణా ఏమిటి ?

నా గుండెలో గుబులు బయటపెట్టలేదు. వాడి కలలు చెరిపెయ్యడం ఎంత క్రూరమైన పని ! అంతటి మిత్రుడికి నేను చెయ్యాల్సిన ఘాతుకం కాదు.

నన్ను కౌగిలించుకుని మరీ బస్ ఎక్కించాడు. కండక్టరు నావంక వింతగా చూశాడు.

ఆత్మీయతను చూపించగలగడమూ కళే – శర్మకి అందులో విశిష్టమైన ప్రతిభ ఉంది. నాలో ముసురుతున్న భావాలని నేను మాటలలోకి మలచలేనని వాడికి తెలుసు అందుకే కౌగిలింత. ఆ ఊరడింపు.

నేను వాడికి చెప్పాల్సింది చెప్పనే చెప్పాను. వాడు కొంచెం ఆవేశం, ఉద్రేకం తగ్గించుకోవాలి, ఆవేశం ధనవంతులకి చెల్లింది. ఉద్రేకం కార్మికులకి చెల్లింది.... కాయకష్టం చెయ్యలేని మధ్య తరగతి మనుషులం మనకి అవేవీ తగవు.

'నన్ను వాళ్లేమీ చెయ్యలేరు ! నా వెనక కొన్ని వందల మంది ఉన్నారు ! వాడి మాటలలో విశ్వాసం వినేసరికి నాకు ఆరోజే భయం వేసింది. ధనవంతుల చదరంగంలో మధ్యతరగతి మనుషులు ఉత్త పావులు. వీడికేం అన్యాయం చేస్తారో ! వీడి స్థానాన్ని వీడు ఎలా నిలదొక్కుకోగలడో !

రాత్రంతా దొర్లుతూనే ఉన్నాడు. వాడు దగ్గుతూనే వున్నాడు. వాడి ఆరోగ్యం గురించి వాడిని అడగడం అప్రస్తుతం. రేపు వాడిని ఆస్పత్రికి తీసుకెళ్లాలి. బాస్‌కి చూపించాలి.

ఏ తెల్లవారుఝామున నిద్రపట్టిందో, లేచేసరికి ఏడున్నరైపోయింది.

చీఫ్ ఓ.పి.లో ఉన్నారు.

''బాస్ ! ఓపి టిక్కెట్టు రాసెయ్యి... బాలగంగాధరశర్మ. ఇరవై నాలుగు ''.

'' ఎవరా బిడ్డ ?'' రోహిణి అపహాస్యం చేసింది.

'' నా ఫ్రెండ్!'' నావంక చూసి రోహిణి మరేం మాటాడలేదు. ఓ.పి. టిక్కెట్టు పోస్ట్‌గ్రాడ్యుయేట్‌కి ఇచ్చాను.

ఇన్వెస్టిగేషన్ రిపోర్టు తీసి ఆయన ముందుంచాను. రెండు నిమిషాలలో ఛీఫ్ పూర్తి చేశారు. 'హాఫ్అఫ్ బోత్ ది అప్పర్ లోబ్స్‌గాన్! ఎవరీయన ?''

''శర్మ నా ఫ్రెండు సార్...''

''హాస్పిటల్‌లో ఎడ్మిట్ చెయ్యండి ! ఫాలో ది కేస్ కేర్‌ఫుల్లీ !'' వైద్య విధానం అసిస్టెంటుకు వివరించారు.

నాకు కొండంత బలం వచ్చింది.

వెంటనే ఆస్పత్రిలో చేరాడు వాడు, రోజూ ఓ అరగంట వాడితో కబుర్లు చెప్పేవాడిని... కష్టసుఖాలు కలబోసుకుని మాట్లాడుకునేవాళ్లం. ఒక వారం పోయాక నెమ్మదిగా అక్కడి నుంచి వచ్చేయడానికి కారణం వివరంగా చెప్పాడు.

యాజమాన్యంతో గొడవ రోజురోజుకీ గొడవ పెరిగిపోతున్న తరుణంలో వాడి ఇంటిమీద అర్ధరాత్రి రాళ్ల వర్షం పడటం మొదలయిందట. ఎవరో గిట్టనివాళ్లు చేస్తున్న పని అని ఒకటి రెండు రాత్రిళ్లు ఊరుకున్నారట... మూడో రోజు వాడి సన్నిహితుడైన ఓ పనివాడు వచ్చాడట. బయట ఓ యాభైమంది ఉన్నారట.

'' ఏమిటి యాదగిరీ ఈ గొడవ ? ఏమైంది ?''

''నువ్ ఊరొదిలి ఎల్లిపోవాల పంతులూ !''

'' ఎందుచేత....

ఆ ఎదురింటిలో మనిషి సచ్చిపోనాడా ! నువ్వేదో గాలి జల్లుతున్నావనీ, చేతబడి చేస్తావనీ చెప్పుకుంటుండారు... నువ్వే ఆడికి సేతబడి చేసినావంట... నే నూరుకున్నా ఆళ్లూరుకోరు. నిన్నిక్కడే సంపేస్తారంట జాస్కో!''

'' ఏమిటీ యాదగిరీ ! చేతబడేమిటీ మట్టి గడ్డేమిటి ? నేను చెయ్యడమేమిటి ? దీనికోసం నేను ఊరొదిలి వెళ్లిపోవాలా ? నీకేమన్నా మతిపోయిందా ?''

''నువ్వూరుకోరా యాదగిరీ ! పంతులూ నీవొల్ల ఆడు నెత్తురు కక్కుకు సచ్చిపోనాడు... అప్పటి వరకూ పిడుగుమడిసి... రంఁడ్రా. ఈ సిల్లంగి పంతులు పళ్లూడదీసి బొమికలు పోగులెట్టేద్దాం !''

ఇంతలో మరొకడొచ్చాడు.

'' ఏటి సేతబడి సేసి ఏడకెలిపోతావ్ బ్రామ్మడా ! నీ సిగ దరిగేస్తా !''

''పిల్లంగి పంతులూ, నువ్వేదో మాకు ఒరగబెట్టేస్తావని జర నిన్ను నాయకుణ్ణి సేస్తే యిదేటి... నువ్ మాకేటి సెయ్యక్కర్లేదు గాని ముందిల్లు ఖాళీ చేసిపోతావా ! జబర్దస్తీ సెయ్‌మన్నావా !''

''అప్పటికి కాని నాకు అందులో రాజకీయం అర్థం కాలేదు. రెండు పూటలా బ్రతకడం కష్టమైంది ఆ వాతావరణంలో. యాదగిరి ధైర్యం చేసి నన్ను వాళ్ల ఇంట్లో దాచాడు.

నా పలుకుబడి చటుక్కున అదృశ్యమైపోయింది. అంతా ఓ కలలా ఉండే వాళ్లలో ఉండటం భయంకరమైపోయింది. వాళ్లు చంపేస్తారన్న భయం కంటే వాళ్ల మూర్ఖత్వం – మరీ భయంకరమైనది.

నామీద యాజమాన్యానికి ఫిర్యాదులు వెళ్లాయి. మేనేజింగ్ డైరెక్టరూ యూనియన్ ప్రెసిడెంటూ వెల్ఫేర్ ఆఫీసర్ మీటింగ్ పెట్టారు. నన్ను పిలిచి సంజాయిషీ అడిగారు. నేను యింటికి వచ్చేసరికి మూడు నెలల జీతం – ఓ శ్రీముఖం నా ముఖాన పారేశారు. కాగితంలో చేతబడి ప్రస్తావన లేదు. కేవలం నేను ఉండడం యాజమాన్యానికి నచ్చనట్లూ, నా ప్రవర్తనలో లోపాలు ఉన్నట్టూ, సంజాయిషీ నచ్చనట్లూ చెప్పి మూడు నెలల నోటీసుకు బదులు జీతం యిచ్చి నన్ను పంపించేశారు. ఇందులో యాజమాన్యంలోని ముఖ్యుల పాత్ర గట్టిగా ఉంది. నాలో ఎదిరించి పోరాడే శక్తి నశించిపోయింది. మనుషులంటే అసహ్యం వేసింది. నేను ఎవరి మేలు కోసం – ఎన్నెన్ని ఆశయాలతో నిరంతరం కృషి చేశానో – వాళ్లు వాళ్లందరూ కాకపోతే వాళ్లలో కొందరు నన్ను తుదముట్టించడానికి ప్రయత్నం చేశారు. యాజమాన్యంతో చేతులు కలిపారు. ఎక్కడో ఎవరో చనిపోతే అది నా చేతబడి అని నాకు చేతబడి చేయించారు. మా సంఘంలో చీలికలని ఎక్కువ చేశారు. నీతి నిజాయితీలు ఉన్న మనుషులు ఈ లోకంలో బ్రతకడం కష్టం, స్వార్థంలేని మనిషిని ఎవరూ హర్షించకపోవడం ఆశ్చర్యం కదూ ! తగినంత దుర్మార్గం నాలో లేకపోవడం నా బలహీనత.''

వాడి కష్టాలన్నీ చెప్పుకున్నాడు, వైద్యుడిని ధైర్యం చెప్పడం నా విధి వృత్తి బాధ్యత. కాని స్నేహితుడిగా వాడి క్షేమం ?

'' ఒక ఉద్యోగం పోయినంత మాత్రాన కొంప మునిగిందేమీ లేదు. అది కాకపోతే దాన్ని మించినది మరొక ఉద్యోగం రాకపోదు పుట్టబోయే నీ బిడ్డ అదృష్టవంతుడే ! నీకు మంచి ఉద్యోగం దొర్కుతుంది.

ఒక్క నెలరోజులు మనసు ప్రశాంతంగా ఉంచుకో. నీ ఆరోగ్యం బాగుపడుతుంది'' అని ధైర్యం చెప్పాను.

బయటికి ధైర్యంగా ఉన్నా మనసులో వాడి గురించి ఎంతో ఆందోళన చెలరేగుతోంది కాని చెయ్యగలిగిందేమీ కనబడడం లేదు.

అంత కష్టంలో ఉన్నా వాడకి నామీద అపేక్షే ! నా చదువయిపోయాక ఏం చెయ్యడమో, ఎలా చెయ్యడమో ఈ విషయాల గురించి నా కంటె అందమైన కలలు వాడే కంటున్నాడు. కాని కలలు వాడికి ఆరోగ్యమైనవేనని నేనేం ఎదురు చెప్పడం లేదు.

'' ఇక్కడ ఏముంది.... దరిద్రులను కడుపునిండా తినమనీ, రొంపి రొష్టుల్లో కొట్టుకుంటున్న మనుషుల్ని ఊటీ వెళ్లమనీ కాశ్మీరులో ఆరోగ్యం కుదుటపడుతుందనీ చెప్పడంకంటె నువ్ ఏ గల్ఫ్ దేశమో పోయి కొన్ని లక్షలు సంపాదించుకుని తిరిగి రావడం మేలు.''

అలా అంటూ ఉంటే స్వదేశం – మన తోటి వాళ్ల కోసం కృషి – ఇలాంటి ఆదర్శాలు నా యెడల వాడు ఎందుకు మరచిపోతున్నాడో నాకు అర్థమయ్యేది కాదు.

వాడు కలలు కంటూ వాటిని రంగులలో కుంచెలతో నా కళ్ల ముందు హరివిల్లుల్లా గీస్తూ వుంటే నాకూ ఏవేవో ఆశలు మనసులో మెదులుతూ ఉండేవి.

నేనూ రోహిణీ ఓనాటి సాయంకాలం టీ.బి. హాస్పటల్ నుంచి కలసి వస్తున్నాము..

'' ఎలా వున్నారు బాలగంగాధర శర్మ ?''

''బెటర్ ! హి యీజ్ పికింగ్ అప్ !''

''అది అంతకు ముందే చెప్పారు... కాని అలాంటి రోగిష్టివాళ్లతో అంతగా పూసుకుతిరగడం మనకి మంచిదికాదు.''

రోహిణి అంత చొరవ తీసుకుని అంత కటువుగా అంటుందని నేను ఊహించలేదు.

'' ఐ నో ఇట్!'' అనేశాను.

రోహిణి కళ్లలో నీళ్లు తిరిగాయి ! 'మైండ్ యువర్ బిజినెస్!' అని నేననేసినట్టు బాధపడిపోయింది. నిజానికి నా మనసులోని మాట అదే. అలా అనే ధైర్యంలేక ఆడదాని యెడల అంత కాఠిన్యం వహించలేక ఆ మాట బయటకు అనలేదు... అదే ఆమె అన్న అయితే నేను ఆమెను అలా శిక్షపెట్టేవాడినా?

ఆమె ముఖం ఎర్రగా అయిపోయింది.

''అది కాదు నా ఉద్దేశం.... మీకు తెలిసినా...''

''మిస్ రోహిణీ.... అలా మనం భయపడితే ఈ వృత్తి చేపట్టడమే అనవసరం.''

బస్సు వచ్చింది. ఆమె ముందు నుంచి నేను వెనక నుంచి ఎక్కాం. ఆ సంభాషణ మళ్లీ మా మధ్య రాలేదు.

రెండు వారాలలో వాడి ఆరోగ్యంలో చెప్పుకోదగ్గ మార్పు వచ్చింది. ఇ. ఎస్. ఆర్. తగ్గింది. దగ్గు పూర్తిగా నయమైపోయింది. మనిషి బాగా తేరుకున్నాడు. నాకున్న కించిత్ పలుకుబడీ వాడికి ఎంతో ఉపయోగించింది. వేళపట్టున మందులూ, మాత్రలూ, ఇంజక్షన్లూ, పుష్టయిన ఆహారం దొరకడం – మనసులో చింత కొంతవరూ నిమ్మళించడంతో వాడి పరిస్థితి మెరుగైంది.

"మా యూనియన్ విశాఖపట్నం బ్రాంచి సెక్రటరీకి కార్డు రాశాను. అతను వచ్చాడు. నా పరిస్థితి వివరించాను. తెలుసుకున్నాడు. ఇక ఘనకి విజయం తప్పదు !'' అన్నాడు శర్మ.

నాకు మాత్రం గుండెలో రాయి పడింది. నా పోస్టింగ్ అయిపోయింది. నన్ను టి.బి. హాస్పిటల్ నుంచి మెంటల్ హాస్పిటల్‌లో వేశారు. నాలుగయిదు రోజులకొకసారి కాని శర్మను చూడడానికి వీలుచిక్కడం లేదు.

నేను అక్కడినుంచి కదిలిన రోజు నుంచే వాడి కష్టాలు ప్రారంభమయ్యాయని చెప్పాడు. నేను వెళ్లినప్పుడు.

ఒంటి నిండా దెబ్బలు, మంచం దిగలేని స్థితిలో ఉన్నాడు.

'' ఏమైంది ?''

'' ఏమడుగుతావ్? ఊరకే సాయంకాలం పూట అలా రోడ్డు మీదకు ఊసుపోక వెళుతూ ఉంటా! నలుగురు మనుషులొచ్చి దబదబా కొట్టేశారు. కిందపడిపోయాను. 'సిల్లంగి పంతులుకిదే శాస్తి! అక్కడ కొడితే ఇక్కడికొచ్చి చేరావా ? ఇక్కడెవుడికి సిల్లంగి పెట్టేద్దామని ? బాణామతి బ్రామ్మడా నీకు మరి భూమ్మీద నూకలుండవ్ ! మాడు పగలేయ్య్ !' ఇవీ నేను విన్న మాటలు.

''అక్కడ నుంచి బయటపడడం ఇక్కడ చావడానికా, ఏం చిత్రం అనిపించింది.''

వాడిని మరేం మాట్లాడించలేదు నేను.

రోజూలాగే షికారుకెళ్లి రాకపోతే పక్కనున్న బెడ్ వాళ్లు రోడ్డు మీదకు వచ్చి చూసేసరికి అక్కడ పడున్నాడట.

'' ఒరేయ్ కరుణా నీకు పుణ్యాం వుంటుంది. నన్ను ఇక ఇంటికి తీసుకుపో ! ఇక్కడ నేనుండలేను!'' అన్నాడు శర్మ అతి దీనంగా.

కాని నేను అంతపని చెయ్యగలనా ? డబ్బుకి డబ్బూ లేదు చేతి కింద బలగమూ లేదు... ఇక్కడ జరిగినట్టు వైద్యం ఇంటి దగ్గర చెయ్యాలంటే వేలమీద మాటే !

పోనీ మరొక ఆస్పత్రికి మార్పిస్తే !

నేను చెప్పినంత మాత్రాన వాడిని ఎవరు మార్చేస్తారు ?

వైద్యశాస్త్రం తెలిసినవాడిగా ఆస్పత్రి నుంచి వాడిని బయటకు కదపడం వాడే కాదు. ఎవరికీ మంచిది కాదు.

ఒక స్నేహితుడితో కొంచెం జాగ్రత్తగా చూసుకోమని చెప్పి బ్రతిమాలాను.

''సారీ బాస్ ! అదేదో సైకిక్ కేస్‌లా ఉంది. ఎవరితోనూ అతనికి పడడం లేదు. పైగా అతనంటే ఎందుకో అందరూ భయపడుతున్నారు.''

ముక్తసరిగా అనేశాడతను.

ఏం చెయ్యడానికీ పాలుపోక నవ్వుతూ మాట్లాడి ధైర్యం చెప్పి రూమ్‌కి వచ్చేశాను.

నేను వచ్చిన మరో పది నిమిషాలలో రోహిణి వచ్చింది. ''మీ ఫ్రెండ్ మన ప్రేమకీ చిల్లంగి పెట్టేశాడు!'' నాకు ఒళ్లు మండిపోయింది.

''రోహిణీ'' ఏమిటా వాగుడు ? యూ ఆర్ ఎ డాక్టర్ ! మూర్ఖులు ఏదో అంటే నువ్ నమ్ముతావా! చిల్లంగేమిటి నాన్సెన్స్ మన ప్రేమకి అవరోధం కల్పించాలని వాడు ఎందుకనుకుంటాడు !''

'' ఓ యబ్బ ! మిత్రుడి మీద ఎంత అభిమానం !''

''ప్లీజ్! నాతో శర్మ గురించి మాటాడకు.. వాడూ నేనూ జ్ఞానం తెలియనప్పటి నుంచీ నేస్తులమే!''

''కాని మిస్టర్ కరుణా మీరు అయన్ను వదిలెయ్యకపోతే....?'' ఏమిటో జడిపించబోయింది.

'' ఐ జస్ట్ డోంట్ కేర్'' ఘాటుగా అనేశాను. అక్కడ నుంచి లేచిపోయాను.

మూడోరోజు కబురు. ఆదరాబాదరా పరుగెత్తాను. శర్మ చనిపోయాడు. నా కాళ్లూ చేతులూ ఆడలేదు.

ఆ కిందటిరోజే ఆడపిల్ల కలిగినట్టు మహలక్ష్మీ బిడ్డా కులాసాగా ఉన్నట్టు ఉత్తరం వచ్చిందట. పక్క బెడ్ అతను ఆ ఉత్తరం చూపించాడు పక్క కప్‌బోర్డు మీద.

ఆ క్రిందటి రోజు ఎవరో పేషెంటు చనిపోయాడట. అది చాలామంది చూశారు. శర్మా చూశాడట. నాతో ఏమీ మాటాడలేదు. జరిగిందేమిటో ఊహించుకోగలిగాను.

నేను అక్కడ నుంచి వాడిని మరొక దగ్గరకు తీసుకు వెళ్లగలిగివుంటే వాడు చనిపోయేవాడు కాదు. వాడి మరణం సహజమైనది కాదు. ఇది ఏదో 'చేతబడి' వ్యవహారమే....

ఎక్కడ హైదరాబాదు, ఎక్కడ విశాఖ ? శర్మ అంత ముఖ్యుడా ? అంత నీచుడా ? వాడి చావు ఎవరికంత అవసరమైంది ? ఎవరీ చేతబడికి కారకులు ?

వారాల తరబడి ఆలోచించినా నాకు సమాధానం దొరకలేదు.

ఆ రోజు నుంచి రోహిణి మాత్రం మళ్లీ నాతో మాట్లాడే ప్రయత్నం చెయ్యలేదు.

దానికి నేను విచారించలేదని చెప్పనక్కర్లేదు.

**యువ**

సెప్టెంబర్, 1988